కథా నిలయం
4570
శ్రీకాకుళం

# మలుపులు




అక్టోబరు మాసం సాయంకాలం చాలా ఆహ్లాదంగా వుంది. బస్సు ఘాట్ రోడ్ మీద వెళ్తాంటే అడవిలోని పరిమళాలు గాలిలో తేలి అకస్మాత్తుగా చుట్టుముడు తున్నాయి. యీ సంవత్సరం కూడా చలి బాగా వున్నట్లే వుంది - అనుకున్నాను, కిటికీ అద్దం కొద్దిగా ముఖానికి అడ్డుగా జరుపుతూ.

పది సంవత్సరాలుగా యిదే రోజు యిదే సమయంలో యిదే చోటుకు వెళ్తూనే వున్నాను

క్రమం తప్పకుండా, మరే విషయాల్లేనూ క్రమాన్ని పాటించని నేను. పాపం వసంత "నేనూ రానా?" అంది దిగులుని కళ్ళనిండా నింపుకుంటూ.

"యెందుకూ, యేం చేయటానికీ?" అని విసుక్కున్నాను. అంతలోనే వసంత కళ్ళలో తడిని గమనించి "మరోసారి మరోచోటికి నిన్నూ, చిన్నానీ తీసికెళ్తాను సంతూ"? అన్నాను.

వసంత నవ్వేసింది, అంతే, దిగులూ, సంతోషం కోపం యేదీ అక్కడ నిలవదు. గాజుపలక మీంచి నీళ్ళలాగా జారిపోతూ వుండాలి. వాన పడి వెలిసింతర్వాత పొడి యెండకి తళతళ మెరిసే కొండరాళ్ళ మల్లే వసంత నవ్వు మెరిసింది.

నవ యౌవనోత్సాహం వసంతది. ప్రతిదీ తాకి చూసి అనుభవించి పలవరించి తెలుసుకోవాలనే వుత్సాహం వురకలు వేసే వయసు.

"చిన్నా యెందుకు? నన్ను మాత్రమే నన్ను వొక్కదాన్నే తీసికెళ్ళాలి. యేం?'

వసంత కళ్ళలో కుబుసం విడిన లాలస మెరుపు, ప్రమాద సంకేతం. అనంతమైన అగాధాల లోతునీ, ఆకాశాల యెత్తునీ కొలవటానికి నిశ్చయించుకున్న ధీరత ఆ చూపులో.

మెల్లిగా నవ్వాను. బేగ్ తీసుకున్నాను చేతికి.

వెనకే నడుస్తూ "యిది యెన్నో వసంతం మేస్టారూ మీకు?"

"యిదే మొదటిది సంతూ" అన్నాను.

"మీరు అన్నీ వదుల్చుకోవాలనీ చూస్తారు. యిప్పుడు యీ రోజు యెందుకు వెళ్తున్నారో తెలీదా? అయిదు సంవత్సరాలుగా చూస్తూనే వున్నాను. వొక్కసారిగా, కొత్తగా వస్తారు. యింతకు ముందు నే నెరిగిన మీరేనా అనిపిస్తుంది వొకోసారి" అని గల గలా నవ్వింది. యెర్రటి పల్చటి పెదిమల వెనక తళ తళ మెరిసే పళ్ళు కాంతి కళ్ళు శరీర మంతా కంపించిపోతూ నవ్వుతెరలు.

యెక్కడి నుంచి వచ్చింది యీ శక్తి వసంతకి, వొక్కోసారి తనని వణికించే తన గురించిన నిజాల్ని వుత్తినే అలా మాటల్లో యేం చెపుతున్నామో పట్టించుకోనట్లు యధాలాపంగా.

అవును వదుల్చుకుంటూనే... వదుల్చుకోటానికే, పుట్టినప్పుడే నిర్ణయమైపోయిన వాటిని మరెన్నిటినో యెన్నెన్నిటినో వదుల్చుకుంటూ ఆ ప్రయత్నంలో ఆ స్థితి. అవును వసంతకేం తెలుసు ఆ స్థితి? యెందుకు తెలీదు? తనకి తెలుసునని తెలియకుండానే తెలుసునేమో?

హారన్ వుధృతంగా చెవుల్లో ధ్వనించి వులిక్కిపడ్డాను. ఆలోచనల జ్ఞాపకాల ఫిల్ము తెగింది. బస్సు ఆగినట్లుంది. యేదో - వూరు - మనుషులు.

వాసనలు - మాటలు - నవ్వులు - కేకలు - పిల్లల యేడుపులు - కాల్తున్న బీడీ ... మల్లెపువ్వు పరిమళం - బస్సు కదిలింది.

కళ్ళు తెరిచేసరికి బస్సు ఆగి వుంది. మనుషులందరూ నెట్టుకుంటూ దిగుతున్నారు. యెటోచూస్తూ కూచున్న నన్ను వింతగా చూస్తూ మెల్లిగా కదులుతున్నారు జనం. జుత్తు చేత్తో సర్దుకుని నుదురు రుద్దుకుని చేతి సంచీ తీసుకుని దిగాను. నర్సింగు వచ్చి చేతి సంచీ తీసుకున్నాడు. దూరంగా ఆపిన జీపు వైపు నడిచాడు. ముందు సీటు తుడిచాడు. కూచోమన్నట్లు చూశాడు. పలకరింపుగా నవ్వి కూచున్నాను.

పెదవులు తెరవకుండా నవ్వి జీప్ స్టార్ట్ చేశాడు. బలంగా తెలిగ్గా స్టీరింగుని పట్టుకుని తిప్పుతున్న పొడవాటి వేళ్ళు, రోడ్డు పక్కే దృష్టి నిలిపిన చూపులు. జీపు కొండ యెక్కుతోంది. వేగంగా మలుపు తిరుగుతూ. మొదటి మలుపు నుంచి లెక్క పెడదామనుకున్న వాణ్ణల్లా విరమించుకున్నాను. రోడ్డు మీద జీపు హెడ్ లైట్స్ పడినంతమేరా మలినమైన వెన్నెల, చీకటి.

వెన్నెల చీకటి, చీకటి వెన్నెల, చీకటి నీగ్రో అమ్మాయి వొంటి నిగారింపులా లేదు. వెన్నెల మంచులో విచ్చుకున్న తెల్ల గులాబీలా లేదు. నల్లటి అమ్మాయి కట్టుకున్న ట్రాన్స్‌పెరెంట్ తెల్లటి చీరలోంచి మెరుస్తున్న చలిస్తున్న అవయవాల్లా దృశ్యాలు కదిలిపోతున్నాయి. యింకా సమయం వుంది అనుకున్నాను. యౌవన విషాదంలో లోయలూ-మలుపులూ- చెట్లూ విచిత్రమైన పరిమళం ముట్టడిలో దిగాలుపడిన సౌందర్యంలా ప్రకృతి.

జీపు ఆగింది బంగాళా ముందు. చెట్ల మధ్యలో సన్నని బాట .... పిచ్చిగా పెరిగిన మొక్కలూ - గడ్డీ గాదరా చీకటిగా మధ్య మధ్య వెన్నెల పొడమచ్చలు. నిశ్శబ్దంగా నడిచాం.

బంగళా వెనక్కి వెళ్ళాడు నర్సింగ్.

చల్లగాలి వీస్తోంది. చలిగా అనిపించి చేతులు కట్టుకుని నించున్నాను. నర్సింగూ, వెనకే మస్తానూ వచ్చారు.

మాసినట్లున్న జుబ్బాలో సన్నగా పీలగా వున్న మస్తాన్ నమస్కారం చేశాడు.

తల వూపాను.

అరనిమిషంలో తలుపులు తెరిచాడు. లోపల లైటు వేశాడు. టేబిలూ, టపోపాయ్, కుర్చీలూ జరుపుతున్నాడు హడావుడిగా.

నర్సింగ్ వేపు తిరిగి "కిరణ్ బావున్నాడా?" అని అడిగాను.

తల పంకించి యేదో మరిచిపోయినట్లు జేబులు వెతికి చిన్న చీటి తీసి యిచ్చాడు నర్సింగ్.

చీటి మడతలు విప్పి గుమ్మంలోపల వెల్తురు పడుతున్న చోట వుంచి తలవంచి చదివాను. "వుదయం యింటికి వచ్చి వెళ్ళు బ్రేక్‌ఫాస్ట్‌కి తప్పకుండా".

జేబునుంచి యిరవై రూపాయలు తీసి నర్సింగు జేబులో వుంచాను. బుజం తట్టాను.

"ఆరుగంటలకి" అన్నాను మెల్లిగా.

నమస్కారం చేసి వెనక్కి వెళ్ళి చీకటి వెన్నెల్లో కలిసిపోయాడు. కొంతసేపయిన తర్వాత జీపు స్టార్టయిన శబ్దం విని లోపలకి నడిచాను మౌనంగా.

లోపల వెచ్చగా వున్న వాతావరణం చల్లబడుతోంది. యింకొద్ది సేపట్లోనే చలివేస్తుందిక్కడ అనుకున్నాను. చేసంచీ జిప్పులాగి లుంగీ, టవల్ అందుకున్నాను.

మస్తాన్ రెండు చేతుల్లో బకెట్లు పట్టుకుని వచ్చాడు. గోరువెచ్చటి నీళ్ళ స్నానం.

తల తుడుచుకుంటూ అడిగాను "అమీనా యెలా వుంది"? అని.

జవాబుగా నవ్వాడు మస్తాన్. "ఫికర్ లేదు సాబ్ మంచి అయ్యా చేతిలో పెట్టాను. నర్సింగుకే యిచ్చి పెళ్ళి చేసాను. యిక నేను యెట్లా బతికినా పరవాలేదు. యెక్కడ కళ్ళు మూసినా ఫరవాలేదు."

"మరి నర్సింగ్" అని ఆపాను ప్రశ్నార్థకంగా.

"అవును సాబ్ నర్సింగ్‌కు మాటలు పోయి రెండేళ్ళయింది. అంతవరకూ అనుకున్న వాళ్ళు పిల్ల నివ్వటానికి రాలేదు. నా తల్లిని అడిగితే సరేనంది. నన్ను నా వాళ్ళంతా వెలివేశారు. అయినా యీ వయసులో నాకు వాళ్ళ అవసరమేముంది? నా బేటీ సుఖంగా వుంటే చాలు".

నాకు ఆశ్చర్యం వేయలేదు. అద్భుతం కాదు, కానీ అసాధారణం అనిపించింది. యితను నేను తెలుసును అనుకుంటున్న మస్తాన్ కాదు. ఆ కొత్తగా తెలుసుకున్న మస్తాన్ పట్ల అభిమానంతో స్పందించింది మనస్సు.

"అలాగా?" అన్నాను మస్తాన్ మాటలు ఆపిన తరువాత మనుషుల పనుల పట్ల అనవసరమైన తీర్పులు చేయటం అలవాటు కాని నేను.

మనుషులు యెందుకు బతుకుతారో తెలిసే బతకనక్కర్లేదు. తెలుసుకోవాలనుకునే ప్రయత్నంలోనే అందరూ బతకటమూ లేదు. బతకటం మానేసి బతుకు గురించి ఆలోచించటంలోనే బతుకు హరించిపోతున్న వారి చైతన్య స్ఫురణలోనే - తల విదిలించాను - ఆలోచనల నుంచి.

"చికెన్ తయారుచేశాను సాబ్. రొట్టెలు చేయమంటారా? కొంత చావల్ కూడా చేయమంటారా?" అడిగాడు మస్తాన్.

"రొట్టెలు చాల్లే మస్తాన్. గ్లాసులు కడిగి వుంచి నీళ్ళూ అదీ సిద్ధం చేసి వెళ్ళిపో అన్నట్లు ఆ కట్టెలు మరికొన్ని వేసి నిప్పులు తెచ్చి నెగడు మండేట్లు చూడు."

నెగడు గూడు దగ్గరగా బల్ల వేశాడు మస్తాన్. నెమ్మదిగా అన్నీ అమర్చాడు.

నేను సిగరెట్ ముట్టించాను.

కొంతసేపటికి రొట్టెలూ, అవీ పళ్ళెంలో వుంచి నిప్పులు తెచ్చి నెగడు రాజేశాడు మస్తాన్. బాగా రాజుకుని మంట ప్రారంభమయ్యాక లేచి నించున్నాడు.

"యిక వెళ్ళు మస్తాన్ అవసరమైతే పిలుస్తాలే" అన్నాను. అవసరం రాదని నాకు తెలుసు. మస్తాన్‌కీ తెలుసు. బేగ్‌లోంచి స్కాచ్ బాటిల్ తీశాను. టేప్‌రికార్డర్ పాకెట్ సైజుది తీసి బేటరీలువేసి కేసెట్ తిరగవేసి ఆన్ చేశాను. వయొలిన్ నాదం తరంగాలుగా గాల్లో తేలుతూ గోడలూ పైకప్పూ అంతా వొక శబ్ద సముద్రం.

చలిగాలి వీస్తోంది. కుర్చీ నెగడు పక్కగా వీపుకి వెచ్చగా వుండేట్లు జరుపుకున్నాను. ట్యూబ్‌లైట్ ఆఫ్ చేశాను. జీరోవాట్స్ బల్బ్ స్విచ్ ఆన్ చేశాను.

బాచీ రావాలి.

రెండు గ్లాసుల్లో స్కాచ్ వంచి నీళ్ళు కలిపి బల్ల మీద వుంచి కూచున్నాను.

గోడల మీద వెలిసిన రంగులూ పెచ్చులూడిన గచ్చులోంచి అసహ్యంగా బయటపడుతున్న గోడల అవయవాలు యెత్తుగా పైకప్పూ- బూజూ పురాతన పద్ధతిలో దూలాలు - గూడులా అమరిక. యెముకల పోగులా చర్మాన్ని యెత్తిపట్టుకున్నట్లు శిథిలమవుతున్న శరీరం నుంచి కదిలివెళ్ళటానికి యిష్టపడని యౌవనం. పరిపూర్ణతలో మాటలు మరిచిపోయినట్లున్న యేకాంతంలా వుంది బగళా.

గాలి కిటికీ రెక్కను వూచికొట్టింది బలంగా. మస్తాన్ వుంచిన కిటికీ పక్కన రాయి జారిపడింది. తలుపులు మెల్లిగా కొట్టుకుంటూ ఆగాయి. గాలి నిట్టూర్పులు యెక్కువయ్యాయి. బాచీ రావాలి.

ఆలోచనలు కట్టిపెట్టేసెయ్. కళ్ళు మూసుకుని లాభం లేదు. ప్రవాహవేగం గమనిస్తూ వుంటే యెప్పుడు దూకుతావు? వొడ్డునే కళ్ళు తిరిగి పడిపోతావు? అని తమాషాగా కళ్ళతో నవ్వాడు బాచీ.

బాచీ మాటల్లో నిజం వుంది. వొడ్డు యెంత నిజమో ప్రవాహం అంతే నిజం - వొడ్డు సగం నిజం. ప్రవాహం సగం నిజం అనుకుందామా పోనీ.

అంత పెద్ద హాల్లో వో మూల వెలుగుతున్న జీరోవాట్స్ బల్బ్ తుడిచి యెన్నాళ్ళయిందో.

రెండు పెద్ద బల్లులు వొకదాని వంక వొకటి తీక్షణంగా చూసుకుంటున్నాయి. వాటి నీడలు గాలికి వూగుతున్న మంటల వెలుగుకి తుళ్ళి తుళ్ళి పడుతున్నాయి. తాపీగా స్కాచ్ వో గుక్క వేసి మౌనంగా బాచీ వొంక స్థిరంగా చూస్తూ కూచున్నాను.

మౌనం, వుద్రేకాలూ, స్పందనలూ పగిలిన విరిగిన అరిగిన మాటలూ - అన్నీ మునిగిన మౌనం.

"రవి కనిపించాడు."

వులిక్కిపడ్డాను.

యెక్కడి రవి? వో తెల్లారుజామున నిద్రకళ్ళతో గుర్తు తెలియని ప్లాట్‌ఫాం మీద కావిలించుకుని వీడ్కోలు చెప్పి జనంలో మాయమైన రవి. చీకటి నాడి కనుక్కోవాలని బయలుదేరిన రవి . నన్నూ, నా చౌరనీనితనాన్ని అనుభవంలో అదృశ్యం కాకుండా నిలిచే సాంద్ర కాఠిన్యాన్నీ అసహ్యించుకునే రవి.

"వొక ప్రభుత్వాన్ని కూల్చి మరో ప్రభుత్వం యేర్పడితే లాభం యేమిటి? యీ ప్రభుత్వాలే పోవాలి".

"మనుషులందరూ వట్టి మనుషులే రవీ, మరేం కారు. అందరు మనుషులూ ఒక్కసారే తెలుసుకోగలిగి తెలిసి నడిచినప్పటికి కదా!"

"నీ అంత సినికల్ మరొకడు లేడు"

"నాకు విలువలంటే యేమిటో తెలీవు. మనుషులంటే అంత ప్రేమా లేదా, ద్వేషమూ లేదు. ప్రభుత్వాలు లేని నీ సమాజంలో నాకు చోటు వున్నా లేకున్నా విచారమూ లేదు, ఆనందమూ లేదు" అని కళ్ళతో నవ్వాను.

మాటల్లో కన్నా చూపుల్లో వ్యంగ్యం చాలా శక్తివంతమైంది.

"నువ్వు మేధో రోగంతో తీసుకుంటున్న మృగానివి. నీ బతుకుని శూన్యత్వం నుంచి తప్పించేందుకు వొక నెపం నీ మేధో కార్యకలాపం. నువ్వు మనిషివి అయితే - నా మాటలు నీకు అర్థమయ్యేవి".

కసి, వేదన, కోపం, అనుతాపం, గాఢంగా, తీవ్రంగా, వేగంగా సుళ్ళు తిరిగే మాటల ప్రవాహం ముందు - గడ్డిపోచలా నేను తలవంచి వూపిరి పీల్చుకుని లేచాను. అంతే. అప్పుడు ఆ జనసముద్రంలో కలిసిపోయిన వ్యక్తి మళ్ళా యెక్కడ?

జ్ఞాపకాల్నించి బయటపడ్డాను. గోడ మూలలో సాలెపురుగు ఏదో వో కీటకాన్ని ముట్టడిస్తోంది. రెండు బల్లులూ ఆ మూలకి బరువుగా, హుందాగా కదిలాయి.

బాచీ కళ్ళు మెరుస్తున్నాయి. ఆ పల్చటి వెలుగులో పెదిమలు బిగించి కూచున్న వాడల్లా నా పక్కకి వంగి అన్నాడు.

"రవి కనిపించాడు శవ రూపంలో - లక్ష్యాన్ని సాధించే ఆచరణ మార్గాల భేదాలకు అతీతంగా పోవాలని ప్రయత్నించడంవల్ల" బాచీ మాటల్లో ధ్వనించిన విషాదం.

బాచీ లేచాడు. కిటికీ దగ్గరికి నడిచాడు. వొక రెక్క బలంగా మూసి కిందపడిన రాయిని తీసి అడ్డుగా వుంచాడు. నా చుట్టూ అలా తిరిగి మళ్ళీ యెదురుగా కుర్చీలో కూచున్నాడు.

స్కాచ్ ఘాటుగా ఉంది. స్వచ్ఛంగా భరించలేని ఘాటు. మరి కొంత నీళ్ళు కలపాలి. మరో గుక్కతాగి గొంతులోంచి అది నెమ్మదిగా కిందికి దిగుతున్న అనుభూతిని గమనిస్తూ వుండిపోయాను.

"రవి మరణం నీకిచ్చిన జవాబు నచ్చలేదు. కదూ?" బాచీ మాటలు నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ.

"జవాబు ప్రశ్నని బట్టే వుంటుంది".

"నీ రక్తంలో మండే అనుభవమే నీకు ప్రమాణం కానక్కర్లేదు. సత్యం కానక్కర్లేదు."

"యేదో వొకటి యెంచుకోవాలి. యెంచుకున్న తరువాత చివరికి మిగిలేది అతివేదనా, గ్లానీ మాత్రమే అయినప్పుడు ..."

'నీ మలుపుల దగ్గర అనుమానం, అసహనం, శీతల నిరసన - యివన్నీ యేమిటీ మరి".

"అదే జీవితం, విశ్వాసం విలువైందే, అంతకన్నా అమూల్యమైంది అనుమానం - మానవ జీవన ప్రస్థాన చోదక శక్తులు అవే - శంక, నిరసన" అని నవ్వాను.

"యిసకలో పిచ్చిక గూళ్ళు కట్టి వొక్క క్షణం నిదానంగా చూసి మరుక్షణం వొక్క తన్నుతో కూల్చి పరుగెత్తుకుపోయే పిల్లవాడి మనస్తత్వం నీది. నీతో మాటల్లో తేలేదే వుంది?" బాచీ మాటల్లో వెనక్కి తీసుకుంటున్న కోపం అల - ఆ స్థానంలోనే పరుచుకుంటున్న అసహనం.

లేచి తలుపులు తెరిచి బయటికి నడిచాను. చలిగాలి నైట్‌క్వీన్ బరువైన పరిమళం వుక్కిరిబిక్కిరి చేస్తుంటే తలెత్తి చంద్రుడివైపు చూశాను. మెల్లిగా నడిచాను. భుజంమీద రాలిన యెండుటాకుని నిదానంగా తీసి జారవిడిచి చిన్ని మొక్కలూ, పిచ్చి పువ్వులూ తాకుతూ నడక - చెప్పులు వేసుకోవటం మరిచాను. చిన్న చిన్న రాళ్ళు అరికాలిలో గుచ్చుకుంటూ నెప్పిపెడుతున్నాయి. సిమెంటు గచ్చు వూడిన మార్గం - రాళ్ళు - పాదాలకి చల్లగా వుంది శవం జ్ఞాపకంలా.

మంచు పడుతోంది. వెన్నెల్లో పువ్వులూ, ఆకులూ మెరుస్తున్నాయి. వాటిని తాకుతూ నించున్నాను. నాలోనూ యేదో శీతలత్వం గాఢంగా రగులుతోంది. ఆలోచన ఆగిపోయింది. కొద్దిగా తలవంచి ఆ నీరవ నిశ్శబ్దాన్ని నమ్రంగా అనుభవిస్తున్న ఆ పువ్వుల మల్లే యెప్పుడు అలా కూచున్నానో యెంతసేపైందో.

బాచీ చేయి నా భుజాల మీద పడింది వెచ్చగా అనిపించింది. చుట్టూ చేతులు వేసి

అమాంతం లాక్కుపోయాడు. నన్ను నాలోంచి లాక్కుపోవటం చూస్తున్న ప్రేక్షకుడిలా చూస్తూండి పోయాను. ఆ చల్లదనం కల కాదు. ఆ ప్రకృతి చిత్రపటంలో నేనూ పువ్వులూ, మొక్కలూ, ఆకాశమూ, చంద్రుడూ, చుక్కలూ అసత్యం కాదు. బాచి చేతుల వెచ్చదనం, గదిలోకి అడుగు పెట్టగానే నెగడు మంట వేడి అబద్ధంకాదు. మిగిలిన స్కాచ్‌ని రెండు గుక్కల్లో ముగించి కుర్చీలో వోపిక లేనట్లు కూలబడ్డాను.

అలిసిపోయాను. యీ వాక్యానికి ముగింపు చుక్క పెట్టాలి అనుకుంటూ బాచీ వంక చూశాను. బాచీ యేదో చెప్పాలనుకున్నట్లు కుర్చీ ముందుకి జరుపుకున్నాడు. నా మొహం వంక నిదానంగా చూస్తున్నట్లు చెప్పటం ప్రారంభించాడు. బాచీ నా మొహం వంకే చూస్తున్నా నిజానికి ఆ చూపులు గత అనుభవాల తెరల్లోంచి యేవో వెతుక్కుంటునట్లున్నాయి.

"యిది నువ్వు విని తీరాలి. వినీ యేం చేసిందో తెలుసా యీ ఆడపిల్లలందరూ అదే రకంగా ఆలోచిస్తూంటారు గావును".

మత్తులోంచి నా కళ్ళు విచ్చుకున్నాయి. "వినీ తన బతుకు తాను బతకాలనుకుంటోంది. అంతే కదా?"

"నా వుద్దేశ్యం అది కాదు నా బాధ్యత"

"యేమిటి నీ బాధ్యత నీ బాధ్యతకి లక్ష్యం ఆమెను ఆమె కాకుండా చేయటమేనా?"

"నేనేం చేశాను. ఆమెనేం అవమానించలేదు. పెళ్ళికి ప్రోత్సహించాను. కారూ, హోదా తన డాక్టరీ వృత్తికి పెట్టుబడిపెట్టే వ్యక్తిని చూపెట్టాను. తన మట్టి ఆశయాలకి బంగారు పూత పూద్దామనుకున్నాను."

"బాచీ, నువ్వు చేయగలిగింది చేయడం యివ్వగలిగింది యివ్వడం మంచిదే కాని అక్కడ పొరబాట్లు యెక్కువ చేసే అవకాశమూ వుంది. వాళ్ళకి జరిగే మేలుకంటే హానే యెక్కువ." కొంతసేపు ఆగి మళ్ళీ అన్నాను.

"వినీ పురుష ప్రపంచంలోని స్త్రీ కాదు - తాను స్త్రీని అని తెలుసున్న జీవిస్తున్న స్త్రీ. నువ్వేర్పరచుకున్న భావాలూ, ఆలోచనలూ, పోగయిన జ్ఞాపకాలూ వీటన్నిటితో ఆమెని సమీపిస్తే యెదురయ్యేవి మంటలే. చదువుకునే రోజుల్లో రమాదేవి కాన్సర్ నయం చేయటం కోసం చందాలు వసూలు చేసిన నీ రహస్య ఔదార్యం, అనాథశరణాలయాల్లో స్త్రీల వివాహం కోసం వరుల్ని వెతికిన నీ ఆదర్శం గొడవలూ, ప్రత్యేక స్త్రీ సమస్యలకి ప్రత్యేక పరిష్కారాలు వెతకటంలో వెచ్చించిన నీ మేథాశక్తీ అన్నీ ఆ మంటల్లో భగ్గుమని మండిపోయి వుంటాయనుకుంటాను. నువ్వొట్టి బాచీగా నగ్నంగా ఖాళీ పాత్రలా నిలబడిపోయి వుంటావు. మొదటి సారిగా నీ జీవితంలో పురుషుడిగా ఒక స్త్రీని చూసి వుంటావు 'పురుష స్త్రీ' ని కాకుండా" - అని తెరలు తెరలుగా నవ్వాను. వొంట్లో బిగుసుకుపోయిన కండరాలన్నీ వదులై సుఖంగా అనిపించేంతవరకూ నవ్వి- ఆగి బాచీ వంక చూశాను.

- స్వేచ్ఛలో బాధ్యత, ప్రేమలో కోరిక, సౌందర్యంలో తృష్ణ అన్నీ విడివిడిగా వుండవు. విప్పి చూడటమూ అసంబద్ధం అని గ్రహింపుకి వచ్చింతర్వాత సంధ్య యేం చేసిందీ, సంధ్య గుర్తుకురాగానే భగ్గున మండే మల్లెమొగ్గలూ ఛెళ్ళున కొట్టే నెత్తురు పరిమళమూ చుట్టుముట్టినట్లనిపించింది.

నావంక నిదానంగా చూసి "నిన్నేం చేయదు. యే అనుభవమూ అందులోంచి యేదీ కోరవూ, కాదనవూ కూడా కనక. కాని, రవి వో మలుపు నా జీవితంలో, యెన్నో మలుపు అని నవ్వేయకు" అన్నాడు బాచీ.

బాచీ వంక స్థిరంగా చూస్తూ అన్నాను.

"బాచీ! జీవితంలో విషాదం అంతా ప్రేమించలేకపోవటంలోనో, ప్రేమ పొందలేకపోవటం లోనో లేదు. మహత్తర ఆశయాన్ని సాధించటంలోనో, సాధించ లేకపోవటంలోనో లేదు. మేధోసామర్థ్యాన్నీ, సమయాన్నీ శుష్కంగా వేటినో సమర్థించుకోటానికో, నలుగురి ఆమోదానికో, అద్భుతానికో వీలుగానో తన అంతర శూన్యత్వాన్ని దాచుకునేందుకు సాధనంగా వాడటంలోనే - అందుకోసం జీవితాన్నే ఖర్చు చేయటంలోనే దాగుంది నిజమైన విషాదం. నిజమైన 'నిన్ను' తెలుసుకో, పదిమందిలోనో యెలానో ఉండాలనుకున్న అవ్వాలనుకున్న 'నువ్వు' కాదు. యథార్థమైన నిన్ను తెలుసుకో నిర్భయంగా నిస్సిగ్గుగా చేయాల్సింది చేసెయ్. యేం యివ్వగలవో యివ్వు. కబుర్లు మానెయ్".

"నువ్వు మాటలకు రంగులు పూయటం నేర్చుకున్నావ్ అంతే" బాచీ కంఠంలోంచి విసుకూ కోపమూ కలిసిన మాటలు చేదుగా వుప్పగా వినిపించాయి. చెవులకి, గాలికి రేగి నెగడులో కట్టె విచిత్రమైన ధ్వని చేసింది. లోలోతుల్లో నా హృదయం మూలగటం వినిపించింది.

"నువ్వు మలుపులకి రంగుపూసినట్లు, సరే. యీ వొక్కరాత్రికోసం యెన్ని రాత్రులు నా రక్తంతో రంగు పూశానో నీకేం తెలుసు. మూడొందల అరవై నాలుగు రాత్రులూ, వడగళ్ళ మెరుపుల మబ్బుల రాత్రులు - పిచ్చిదాని మొహంలో పరుచుకున్న వెర్రి వెకిలి నవ్వులాంటి వెన్నెల రాత్రులూ యెన్ని - అనుకుని నిట్టూర్చాను.

బాచీ లేడు. యింక సమయం లేదు.

నెగడు ఆరిపోయింది. బొగ్గులు మండుతున్నాయి. కణకణమని కాలిన కర్ర శవం మీంచీ బూడిద లేస్తోంది గాలికి, గాలి చాలా స్వచ్ఛంగా వీస్తోంది.

చెట్ల కొమ్మల గూళ్ళ పిట్టలన్నీ మేల్కొన్న సందడి - తెల్లవారిపోయిందనడానికి సూచన.

బయటికి చూశాను. జీవితంలా పొంచి వుంది వెలుగు. సాలెపురుగూ, బాచీ స్మృతులు పంచుకునే వస్తువులూ - కుర్చీలూ - గ్లాసులూ - గోడలూ - బల్లులూ - వ్యవధి లేదు.

యీ అనుభవాన్ని మిగుల్చుకోవాలి. యీ గది వెలుతురుతో మలినం కాకముందే తప్పించుకోవాలి - తప్పదు.

నెమ్మదిగా చుట్టూ చూశాను. బాచీ ముందున్న గ్లాసులో నిండుగా నింపింది నింపినట్లే వుంది. అందులో యేదో చిన్న పురుగు శరీరం తేలుతోంది శవమై. అది బాచీ కావొచ్చు కదా అని నవ్వుకున్నాను.

చేతి సంచీ సర్దుతూ ఉన్నాను. జీపు హారన్ వినిపించింది. యిక ప్రారంభమైంది. ఖచ్చితంగా సమయం ప్రకారం అన్నీ జరుగుతాయనీ తెలుసు.

నేను వెలుతురు పంజరంలోకి ... నాలో చీకటి కుహరంలో తొలుస్తున్న బాధ - రక్కసి ముళ్ళపొదలు లోలోతుల్లో చీకటి లోయల్లో-

వెలుతురు కళ్ళని పొడుస్తుంటే బయటకు నడిచి జీపు దగ్గరకు వచ్చాను. నర్సింగు సీటుమీద లేని దుమ్ముని మళ్ళీ తుడిచాడు నా వంక చూసి నవ్వాడు.

"నర్సింగ్!" అని పిలిచాను. నా స్వరం నాకే కొత్తగా వినిపించింది. జేబులోంచి వంద నోటు తీశాను. "అమీనా కేదైనా కొనిపెట్టు" అన్నాను నర్సింగు చేతిలో వుంచుతూ. నర్సింగ్ సంతోషంగా నిశ్శబ్దంగా నవ్వాడు పెదవులు తెరచి తడికళ్ళు మెరుస్తుంటే.

జీపు యెక్కాను. దారిలో మలుపులు లెక్కపెట్టాలనుకుని మానేసి చుట్టూ చూస్తూ కూర్చున్నాను.

వెలుతురు అడవి మృగంలా వొళ్ళు విరుచుకుంటూ వుంది. అందులో వికారమూ వుంది. అందమూ వుంది. జీపు వేగంగా మలుపులు తిరుగుతోంది. మలుపుల దగ్గర మాత్రం కలిగే అనుభవం కోసం మళ్ళీ రాకతప్పదు - మూడొందల అరవై నాలుగు పొడుగూ పొట్టీ శీతల వృష్ణ చీకటి వెన్నెల రాత్రుల తరువాత - సంతూ లేకుండానే -

(9.12.1987, ఆంధ్రప్రభ వారపత్రిక)
(ఒకతరం తెలుగు కథ కేంద్ర సాహిత్య అకాడెమీ, 1994
కన్నడ అనువాదం 2001)